సాక్షి
వికారాబాద్

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



డ్రోన్ వ్యవసాయం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. 10లో▸



పశు సంరక్షణపై ఆందోళన

పశువైద్య శాఖ అధికారుల తీరుపై తాండూరు ఏఎంసీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 10లో▸



స్వచ్ఛ అనంతగిరికి..

స్వచ్ఛ అనంతగిరికి ప్రతిఒక్కరూ పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి పేర్కొన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ వైద్య కళాశాలలో 26, 27న ఇంటర్వ్యూలు

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో వివిధ విభాగాలలో (28) సీనియర్ రెసిడెంట్‌లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డాక్టర్ దీన్‌దయాళ్ బంగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలను జీఎంసీవికారాబాద్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. ఈ ఉద్యోగాలకు గౌరవ వేతనం చెల్లించబడుతుందన్నారు.

ప్రొఫెసర్లు, అసోసియేటెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు..

కాంట్రాక్టు ప్రాతిపదికన వివిధ విభాగాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్లు(2), అసోసియేటెడ్ ప్రొఫెసర్లు(17), అసిస్టెంట్ ప్రొఫెసర్లు(30) పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దీన్‌దయాళ్ బంగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన సూచించారు. వివరాలను జీఎంసీవికారాబాద్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

23న మెగా వైద్య శిబిరం

తాండూరు టౌన్: పట్టణంలోనిమాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రసూతి, పిల్లల, నేత్ర, ఈఎన్‌టీ, దంత, చర్మ, మానసిక వైద్యానికి సంబంధించిన స్పెషలిస్టు వైద్యులు ఈశిబిరంలో సేవలందిస్తారన్నారు. మహిళా, శిశు సంరక్షణ సేవలు,టీబీనమోదు, రక్తదాన శిబిరాల నిర్వహణ, మహిళా ఆరోగ్య సేవలు, కిషోర బాలికలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతులే విత్తనాలు ఉత్పత్తి చేసుకోవాలి

శాస్త్రవేత్త డాక్టర్ సునీత



ఎన్నారం విత్తన క్షేత్రంలో శాస్త్రవేత్త సునీత తదితరులు

బంట్వారం: రైతులు తమ పంట పొలాల్లోనే విత్తనాలు ఉత్పత్తి చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ సునీత అన్నారు. శనివారం ఆమె కోట్‌పల్లి, రాంపూర్, ఎన్నారం గ్రామాల్లో వరి, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు పండించడంలో తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తన పథకం (క్యూఎస్ఈవీ) అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేస్తున్న నాణ్యమైన విత్తన క్షేత్రాలను సందర్శిస్తున్నామని చెప్పారు. రైతులే విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేస్తే ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనాలు అందుబాటులో ఉండటమే కాకుండా నకిలీ సీడ్స్‌తో మోసపోకుండా ఉండవచ్చన్నారు. రైతులు తాము పండించిన విత్తనాలను ఇతరులకు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి, ఏఈఓలు సందీప్, నర్మద రైతులు పాల్గొన్నారు.

పెంచిన ఆర్టీసీ చార్జీలు తగ్గించాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

అనంతగిరి: దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ పెంచిన అదనపు బస్సు చార్జీలను వెంటనే విరమించుకోవాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన వికారాబాద్ ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. పండుగల వేళ బస్సు చార్జీలు పెంచి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. సొంత గ్రామాలకు సంతోషంగా వెళ్లే ప్రయాణికులకు పెరిగిన చార్జీలు భారంగా మారాయన్నారు. ఆయన వెంట ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటేశం, విద్యాసాగర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



తాండూరు టౌన్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు

ఆట.. పాట.. రంగుల పూదోట

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం నుంచి దసరా సెలవులు కావడంతో శనివారం ఒకరోజు ముందుగానే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఉత్సాహంగా గడిపారు.



తాండూరు రూరల్: బతుకమ్మ వేడుకల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు

డీఫాల్టర్లకు ధాన్యం బంద్



తాండూరు డీసీఎంఎస్ రైస్ మిల్లు

రెండేళ్లుగా పౌరసరఫరాల శాఖకు బియ్యం ఇవ్వని మిల్లర్లు

- జిల్లాలో 30 మిల్లులకు నోటీసులు
- రూ.20 కోట్ల ఫెనాల్టీ

తాండూరు: పౌరసరఫరాల శాఖ రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌ను అదునుగా చేసుకొని పేదలకు పంపిణీ చేసే బియ్యంతో అక్రమాలకు పాల్పడ్డారు. రైస్ మిల్లుల యజమానులు గడువులోపు అందించకపోవడంతో 30 మంది నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేసి రూ.20 కోట్లు జరిమానా విధించారు. ఈ వానాకాలంలో రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని డీఫాల్టర్లకు ఇవ్వొద్దని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

రీసేల్

జిల్లాలోని 20 మండలాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. సాగునీటి వనరులు మెరుగుపడడంతో ఎనిమిదేళ్లుగా సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, బోరు మోటార్ల కింద వరిసాగు వానాకాలంలో 1.20 లక్షల ఎకరాలు, యాసంగిలో సుమారు 80 వేల ఎకరాల వరకు సాగవుతోంది. ఈ ధాన్యాన్ని ఏటా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆధీనంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సేకరించిన ధాన్యాన్ని ప్రజా పంపిణీ కోసం సీఎంఆర్ చేసేందుకు రైస్ మిల్లులకు తరలిస్తారు. కాగా 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో తరలించిన ధాన్యం మిల్లర్లు గడువు ముగిసినా అందించలేదు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు విచారణ చేపట్టారు.మిల్లుల్లోకి వెళ్లి తనిఖీలు చేపట్టగా ధాన్యం కనిపించలేదు. ఇటువంటి 30 మంది రైస్ మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేయడంతో పాటు రూ.20 కోట్లు చెల్లించాలని గతంలో నోటీసులు జారీ చేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేశారు.

సీఎంఆర్ ధాన్యం అమ్మకాలు

రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి సీఎంఆర్ కోసం రైస్ మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని మిల్లు యజమానులు తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించారనే ఆరోపణలున్నాయి. తాండూరు వ్యవసాయ మార్కెట్లో ఏటా 40 వేల నుంచి ఆరువేల క్వింటాళ్లు మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయి. కానీ 2023లో మార్కెట్ యార్డులో 4 లక్షల క్వింటాళ్లు విక్రయాలు జరిగాయి. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం రైస్ మిల్లర్లు రైతుల పేరిట విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి.

> **అధికారుల నిర్ణయం ఫైనల్**
>
> పౌరసరఫరాల శాఖకు 30 రైస్ మిల్లులు సీఎంఆర్ ఇవ్వలేదు. దీంతో మిల్లు యజమానులను డిఫాల్టర్ల జాబితాలో చేర్చి నోటీసులు జారీ చేశారు. 30 మిల్లుల యజమానుల నుంచి రూ.20 కోట్ల వరకు పెనాల్టీ విధించాం. డిఫాల్టర్లకు ఈ సీజన్‌లో సీఎంఆర్ అందించే విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు.
>
> – మోహన్‌కృష్ణ, డీఎం, పౌరసరఫరాల శాఖ

పనితీరు ప్రశంసనీయం

- ఆర్టీఐను పటిష్టంగా అమలు చేయడమే కమిషన్ లక్ష్యం
- చట్టం అమలులో తెలంగాణ తొలిస్థానంలో ఉండాలి
- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

అనంతగిరి: సమాచార హక్కుకు సంబంధించి జిల్లా అధికారుల తీరు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్టీఐ -2005పై పీఐఓ(పబ్లిక్ ఇన్ఫర్మేషన్ యాక్ట్) అధికారులకు అగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. 137 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉండడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. పీఐఓలు, ఏపీఐఓలు దరఖాస్తులు స్వీకరించి ప్రజలు అడిగిన సమాచారం అందించాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారుడు గ్రామ సమాచారం కోరితే ఎటువంటి డబ్బు వసూలు చేయాల్సిన అవసరం లేదని.. మండల సమాచారం కోరితే రూ.5 చెల్లించాలన్నారు. ఆర్టీఐపై అధికారులకు అవగాహన కల్పించి పటిష్టంగా అమలు చేయడమే కమిషన్ లక్ష్యమన్నారు. ప్రతీ అధికారి హక్కులు, బాధ్యతలు, చట్టప్రకారం పాటించాల్సిన మార్గదర్శకాలు తెలుసుకోవాలని సూచించారు. పీఐఓల సమాచారంతో సంతృప్తి చెందకుంటే ఫస్ట్ అప్పిలేట్ అథారిటీని సంప్రదించేలా అవగాహన కల్పించాలని కోరారు.

స్పెషల్ హియరింగ్

కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు సమాచార హక్కు చట్టం దోహదపడుతుందన్నారు. పీఐఓలకు చట్టంపై అవగాహన కల్పించిన కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అధికారులు అవగాహన పెంచుకుని ఆర్టీఐ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారుకు పారదర్శకంగా సమాచారాన్ని అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 137 అప్పీల్ కేసులను కలెక్టరేట్‌లో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ ప్రత్యేకంగా హియరింగ్ నిర్వహించి పరిష్కరిస్తుందని చెప్పారు.

ఆలస్యం చేస్తే చర్యలు

అనంతరం ఆర్టీఐ కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, మొహసిన్ పర్వీన్, దేశాల భూపాల్, బి.అయోధ్య రెడ్డి, వైష్ణవి మెర్ల మాట్లాడుతూ.. అధికారులు ఆర్టీఐ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతీ అధికారి సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అధికారి తప్పుడు సమాచారం ఇచ్చినా, ఆలస్యం చేసినా ఆర్టీఐ చట్టం సెక్షన్ 21, 22 ప్రకారం కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. దరఖాస్తులను సకాలంలో పరిష్కరిస్తే ప్రజలలో అనుమానాలుండవన్నారు. ప్రపంచంలో భారతదేశం సమాచార హక్కు చట్టం అమలులో 8వ స్థానంలో ఉందన్నారు. దేశంలో తెలంగాణ సమాచార హక్కు చట్టం అమలులో మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సమాచార హక్కు చట్టానికి సంబంధించి పెండింగ్ ఉన్న 137 కేసులను కమిషన్ సభ్యులు కలెక్టరేట్‌లో పరిశీలించి పరిష్కరించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రధాన కమిషనర్లు పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, మొక్కలు నాటారు. సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి,, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, పీఐఓలు, ఏపీఐఓలు, ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పిలేట్ అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ అలధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ శ్రీనివాస్

కిశోర బాలికలతో ఎస్‌హెచ్‌జీలు

- జిల్లా వ్యాప్తంగా 70 వేల సంఘాలు ఏర్పాటు చేయాలి
- స్నేహ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి
- డీఆర్‌డీఏ శ్రీనివాస్

తాండూరు రూరల్: గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల తరహాలో కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల్లోని ఐకేపీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 14 ఏళ్ల నుంచి 18 సంవత్సరాల బాలికలతో 70 వేల కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళ జీవితంలో కిషోర బాలిక దశ కీలకమైనదని.. వారికి సరైన దారి చూపితే సమాజానికి మార్గదర్శకురాలు అవుతుందన్నారు. సంఘాలు ఏర్పాటు తర్వాత బాలికల భద్రత, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం సహకరిస్తోందని వివరించారు. స్నేహ యాప్‌లో కిషోర బాలికల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల సంఘాలు సైతం ఏర్పాటు చేయాలన్నారు. నవంబర్ 20వ తేదీలోపు అన్ని సంఘాల ఏర్పాటు పూర్తి చేయాలని ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌ఆర్ఎల్ఎం(నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్) పథకం కింద గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నర్సింలు, డీపీఎంలు నర్సింలు, కొమరయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జానకి, శ్రీనిధి ఆర్ఎం ఉదయ్‌కుమారి, ఏపీఎంలు బాలయ్య, శ్రీనివాస్, పద్మారావు, గోపాల్, వెంకన్న, బందెయ్య, సీసీలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

కద్లాల్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను ప్రజాభవన్‌లో అన్నాస్‌పల్లి, జమ్ములాబావితండాకు చెందిన చెంచు రైతులు కలిశారు. 1988లో అప్పటి ప్రభుత్వం అన్నాస్‌పల్లి, జమ్ములాబావితండాకు చెందిన 27 మంది రైతులకు 54 ఎకరాలు కేటాయించిందని తెలిపారు. నాటి నుంచి సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా సేద్యం చేస్తున్న భూములకు భూ భారతిలో పట్టాలిప్పించాలని వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసిన మంత్రి న్యాయం చేయాలని సూచించారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

కలెక్టర్‌కు భూ బాధితుల విజ్ఞప్తి

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణ విషయంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేసి, టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన రికార్డులను తిరిగి రైతుల పేర్లపై నమోదు చేసేలా కృషి చేయాలని ఫార్మాసిటీ భూ బాధితులు కలెక్టర్ నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పలువురు రైతులు కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టు జారీ చేసి ఉత్తర్వుల పత్రాలను కలెక్టర్‌కు అందించారు. ఆన్‌లైన్‌లో భూ రికార్డులను నమోదు చేయాలని ఉత్తర్వులున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నేతలు పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమైన ఫార్మాసిటీ భూ బాధితులు

రైల్వే లైన్ మారింది!

- లగచర్ల కారిడార్ మీదుగా 'వికారాబాద్–కృష్ణా' అలైన్‌మెంట్
- రూ.2,785 కోట్లతో అంచనా
- జిల్లాలో కొత్తగా నాలుగు రైల్వే స్టేషన్లు

ముందుగా అనుకున్న రూటు: పరిగి, కొడంగల్, హస్నాబాద్, దౌల్తాబాద్, నారాయణపేట, కున్సి, కృష్ణ

రూటు మారిన తర్వాత: పరిగి, తుంకిమెట్ల, కొడంగల్, బాలంపేట, మద్దూరు, నారాయణపేట, మక్తల్, కృష్ణ

కొడంగల్: వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ రూటు మారింది. నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ మీదుగా రైలు మార్గం నిర్మించడానికి అలైన్‌మెంట్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో గత వారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైల్వేశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 130 కిలో మీటర్ల దూరం నిర్మించనున్న కొత్త రైల్వే లైన్‌కు సుమారు రూ.2,785 కోట్ల ఖర్చు కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దసర పండుగ తర్వాత సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రైల్వే బోర్డుకు అధికారులు సమర్పించే అవకాశం ఉంది. వికారాబాద్ జిల్లాలో పరిగి, తుంకిమెట్ల, కొడంగల్, బాలంపేట శివారులో కొత్తగా రైల్వే స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

నిరీక్షణకు మోక్షం


కొడంగల్, పరిగి నియోజకవర్గ ప్రజలు 45 ఏళ్లుగా నిరీక్షిస్తున్న వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్‌కు మోక్షం లభించింది. ఈ మార్గంతో ఇక్కడి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. రైల్వే లైన్‌తో రవాణా వ్యవస్థ మెరుగు పడడంతో పాటు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేసేందుకు 1980–81లో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లికార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే చేయించారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలను విశ్లేషిస్తూ ఇక్కడి ప్రజలు కేంద్రానికి నివేదిక పంపించారు. దీంతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆదేశాల మేరకు రెండో సారి సర్వే చేపట్టారు. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే బాగుంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు. రాష్ట్ర విభజన తర్వాత జిల్లాల పునర్విభజనలో కోస్గి, మద్దూరు మండలాలు నారాయణపేట జిల్లాలోకి వెళ్లాయి. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే వికారాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా ఉంటుందని స్థానికులు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చారు.

డీపీఆర్‌కు సీఎం ఆదేశాలు

కొడంగల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో రైల్వే అధికారులతో పలుమార్లు సమాలోచనలు చేశారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు కొడంగల్ మండలం టేకుల్‌కోడ్ దగ్గర నిర్మించనున్న సిమెంట్ ఫ్యాక్టరీ మీదుగా రైల్వే నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు పరిగి, తుంకిమెట్ల, కొడంగల్, మద్దూరు, నారాయణపేట మీదుగా కృష్ణ వరకు రైల్వే లైన్‌కు మార్గం సుగమమైంది.



వికారాబాద్ రైల్వే స్టేషన్



కొత్త మార్గం

క్లుప్తంగా

స్వస్థ్ నారీ స్వశక్త్‌తో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ ప్రియదర్శిని



పరీక్షలు చేస్తున్న వైద్యులు

దౌల్తాబాద్: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రియదర్శిని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చెవి, ముక్కు, గొంతు నొప్పి లక్షణాలున్న 132 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ స్పెషలిస్టు వైద్యులు నాగరాజు, సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్‌ఎంలు సిబ్బంది ఉన్నారు.

తాండూరు మండలానికి ఏడుగురు జీపీఓలు

తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: మండలానికి ఏడుగురు గ్రామ పాలన అధికారుల(జీపీఓ)ను నియమించినట్లు తహసీల్దార్ తారాసింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 22 క్లస్టర్లకు గాను ఏడుగురు విధుల్లో చేరారన్నారు. వ్యర్థ తేజస్ నాయక్, ఈడ్గి రాంచంద్రయ్య, బి.కిష్టప్ప, నర్మద, నీరటి వెంకటయ్య, బి.చిన్న నర్సింలు మండలానికి కేటాయించారని వివరించారు. మరో 15 మంది మండలానికి జీపీఓ రావాల్సి ఉందన్నారు. వారందరూ వచ్చిన తర్వాత జీపీఓలకు క్లస్టర్ల వారీగా గ్రామాలు కేటాయిస్తామన్నారు.

దిగుబడి లేక మార్కెట్ వెలవెల!



ఉత్పత్తులు, రైతులు లేక వెలవెలబోతున్న యార్డు

ధారూరు: వ్యవసాయ ఉత్పత్తులు లేక ధారూరు మార్కెట్ వెలవెలబోతోంది. మండల వ్యాప్తంగా రైతులు ఈసారి సుమారు వెయ్యి ఎకరాల్లో పెసర, వంద ఎకరాల్లో మినుము సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలోనే కురిసిన భారీ వర్షాలకు చేలు పూర్తిగా పాడయ్యాయి. దీంతో దిగుబడులు చేతికంద లేదు. రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు మార్కెట్లోకి సరుకు రావడం లేదు. ఏటా ఈసీజన్‌లో వేలాది బస్తాల పెసర, మినుము ఉత్పత్తులు మార్కెట్‌కు తరలివచ్చేవి. పంటలు దెబ్బతినడంతో శనివారం రైతులు లేక మార్కెట్ కళావిహీనంగా కనిపించింది. వ్యాపారులు, అడ్తిదారులు మధ్యాహ్నం వరకే ఇళ్లకు వెళ్లిపోయారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



ఆలంపల్లిలోని ఆలయం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో మొదటి రోజు సాయంత్రం 4.30 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభిస్తారని తెలిపారు. నిత్యం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చన, పూజలతో పాటు రాత్రి 7 గంటలకు స్వామి వారి వాహన సేవ ఉంటుందని తెలిపారు. మంగళవారం హనుమత్‌వాహనంపై, బుధవారం ముత్యాలపందిరి, గురువారం శేషవాహనం, శుక్రవారం గరుడ, శనివారం చంద్రప్రభ, ఆదివారం సూర్యవాహన సేవ కొనసాగనున్నాయని వివరించారు. దసరాను పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు అశ్వవాహన ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అనంతరం 5గంటలకు ఆలంపల్లి మైదానంలో రావణదహనం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

డ్రోన్ వ్యవసాయం

- పురుగు మందు పిచికారీలో విరివిగా వినియోగిస్తున్న రైతులు
- మందుల వాడకం తగ్గడంతో పాటు కూలీల కొరతను అధిగమిస్తున్న కర్షకులు
- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న అన్నదాతలు



రైతులు తెచ్చిన డ్రోన్

దౌల్తాబాద్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వరికోత నూర్పిడి పలు పనులు యంత్రాలతో చేస్తున్నారు. వివిధ పంటలతో పాటు వరిపైరులోనూ డ్రోన్ల సాయంతో పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. దీంతో వాడే మందుల మోతాదు తగ్గించుకోవడంతో పాటు కూలీల కొరతను అధిగమిస్తున్నారు. పెట్టుబడిని ఆదా చేసుకుంటున్నారు.

తగ్గనున్న మందుల వినియోగం

వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం ఎకరా వరిపైరుపై తైవాన్ స్ప్రేయర్‌తో మందులను చల్లించాలంటే 120 నుంచి 140 లీటర్ల నీటిలో మందులను కలిపి చల్లించాలి. ఇందుకు మందు చల్లే వ్యక్తితో పాటు ట్యాంక్‌లో నీరు పోయడానికి ఓ మనిషి అవసరం ఉంటుంది. అందుకు రూ.వేయి ఖర్చు అవుతుంది. ఇదే పనిని డ్రోన్లతో 30–40 లీటర్ల నీటిలో మందును కలిపి ఎకరానికి చల్లుకోవచ్చంటున్నారు. అయిదెకరాల మందు పిచికారీకి ఒక మనిషి సరిపోతారని చెబుతున్నారు. డ్రోన్‌తో ఎకరం మందు పిచికారి చేసేందుకు రూ.400 ఖర్చువుతుంది. పురుగుమందు మోతాదు సైతం తగ్గించుకోవచ్చని కర్షకులు వెల్లడిస్తున్నారు.

పంటల్లో భారీగా నీరు

వర్షాలు అధికంగా పడడం వల్ల పాలాల్లో నీరు మోకాళ్ల లోతు వరకు చేరాయి. అంతలోతు నీటిలతో తైవాన్ స్ప్రేయర్‌తో మందు పిచికారీ కష్టంగా మారింది. దీంతో సాధారణ పద్ధతికంటే డ్రోన్‌ల సాయంతో సస్యరక్షణ చర్యలు చేపట్టడం మంచిదని భావించిన రైతులు అటుగా మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం నందారం గ్రామంలో రైతులు డ్రోన్లను విరవిగా వినియోగిస్తున్నారు.

ఖర్చు తగ్గింది



వరి పంట సాగులో పురుగు దోమ ప్రభావం కనిపించింది. పొలాల్లో నీళ్లు ఎక్కువగా ఉండడం కూలీల కొరత ఉండడం మనుషులతో అయితే మందు పిచికారీ సక్రమంగా జరగదని డ్రోన్ సహాయంతో పిచికారి చేయించా. పని సులభమయింది. ఖర్చు తగ్గింది. – రాజశేఖర్‌రెడ్డి, రైతు, నందారం

ఫోన్ల వినియోగంలో అప్రమత్తత అవసరం



షీ టీం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు

యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

యాలాల: స్మార్ట్ ఫోన్ల వినియోగంలో బాలికలు అప్రమత్తంగా ఉండాలని యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సూచించారు. శనివారం తాండూరు షీ టీం ఆధ్వర్యంలో అగ్గనూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయంలో అవగాహన ఉండాలన్నారు. అనవసర లింకులు ఓపెన్ చేసి సైబర్ నేరాల బారిన పడొద్దని సూచించారు. ఫొటో మార్ఫింగ్, ఈవ్ టీజింగ్, అత్యవసర సమయాల్లో డయల్ 100, 181 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు. అనంతరం షీ టీం ఇంచార్జీ శేఖర్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆదేశాలతో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలికలు, యువతీ యువకులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

- ఇద్దరికీ తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సమీపంలో శనివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వికారాబాద్‌కు చెందిన అడ్వకేట్ బాలయ్య వ్యక్తిగత పని నిమిత్తం సంగారెడ్డికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే కొంపల్లికి చెందిన సుభాష్ వికారాబాద్‌లో పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్నాడు. వీరిరువురూ కొత్తగడి సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాల సేకరించారు. ఇదిలా ఉండగా బాలయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గంజాయి స్వాధీనం

తాండూరు రూరల్: గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాథోడ్ వినోద్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన ఎండీ ముస్తాకిన్ తాండూరు మండలం గోపన్‌పల్లి రోడ్డులో వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

తాండూరు రూరల్: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటన పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన సిద్దారెడ్డి ట్రాక్టర్ శనివారం ఉదయం పెద్దేముల్‌కు వస్తుండగా మార్గ మధ్యలో తింసాన్‌పల్లి వద్ద బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ తప్పించుకోవడంతో స్వల్పగాయాలతో బయట పడ్డాడు. అనంతరం జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను పైకి తీశారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సర్చ్

అత్తాపూర్: నేరాల నియంత్రణకు కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున 6 గంటలకు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్, ఇంద్రానగర్ ప్రాంతాలలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. మొత్తం 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. 12 సర్చ్ టీంలతోపాటు ఐదు ప్రధాన రహదారులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 16 వాహనాలు, నెంబర్ ప్లేట్స్ లేకుండా 35 నడుస్తున్న వాహనాలు, సరైన పత్రాలు లేని ఆరు ఆటోలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండు బెల్ట్ షాపులను సీజ్ చేశారు. రెండు హుక్కా సెంటర్లు, గ్యాస్ ఫిల్లింగ్ రీఫిల్ సెంటర్లపై దాడులు చేశారు. చెక్ పోస్టుల వద్ద వాహనాలను పరిశీలించి చలానాలు కట్టకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చలానాలను కట్టించారు. 475 మంది ఆధార్ కార్డులను పరిశీలించగా అందులో 27 మంది పక్క రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. ఆరుగురు రౌడీషీటర్ల ఇళ్లలోకి వెళ్లి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా వంటిని ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే డయల్ 100కు సంప్రదించాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీసీపీ స్పష్టం చేశారు. కార్డెన్ సర్చ్‌లో అదనపు డీసీపీ ఏఎస్ రావు, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన సిమెంట్ ట్యాంకర్



రోడ్డు పక్కన పడిపోయిన క్షతగాత్రుడు భానుప్రసాద్

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

ధారూరు: బైక్‌ను సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆశాపురి ఫ్యాక్టరీ వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపిన ప్రకారం.. పెద్దేముల్ మండలం రుక్మాపూర్‌కు చెందిన భానుప్రసాద్ హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. పెద్దల అమవాస్య కోసం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా సుద్ద ఫ్యాక్టరీ రోడ్డుపై సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పీఎస్‌లో ఇసుక ట్రాక్టర్లు

యాలాల: కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సంగెంకుర్దులో కాగ్నా నది నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు తమ సిబ్బంది తనిఖీలు చేపట్టగా రెండు ఖాళీ ట్రాక్టర్లు ఇసుక రవాణాకు వెళ్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అదే సమయంలో దేవనూరు శివారులో తనిఖీలు చేపట్టగా ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టరును గుర్తించి తనిఖీలు చేయగా ఎటువంటి అనుమతి పత్రాలు లేవు దీంతో ఖాళీ ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగిస్తామని.. లోడ్ ట్రాక్టరుపై నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: ముగ్గురు పిల్లలతో గృహిణి అదృశ్యం అయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అతికుర్ రెహమాన్, భార్య నజీనీ కాతూన్(32), ముగ్గురు పిల్లలు దిల్‌నవాజ్(11), హమ్మత్(9), ఫవద్(6)లతో కలిసి జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మామిడిపల్లికి వలస వచ్చారు. స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17న కూరగాయలు తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చిన రెహమాన్‌కు ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ కనిపించలేదు. వారి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉంది. దీంతో సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్, లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అమ్మగారింటికి వెళ్లొస్తానని..

శంకర్‌పల్లి: అమ్మగారింటికి వెళ్లి వస్తానని వెళ్లిన మహిళ అదృశ్యం అయింది. ఈ సంఘటన శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని రెడ్డి కాలనీలో నగేష్(38), శివాని(22) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు(8), కుమార్తె(6) ఉన్నారు. నగేష్ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న శివాని తన ఇద్దరూ పిల్లలను పాఠశాలకు పంపించింది. ఉదయం 9 గంటల తర్వాత భర్తతో అమ్మగారింటికి(కొండకల్ గ్రామం) వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. కానీ రాత్రి అయినా ఆమె తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త ఠాణాలో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి!

గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించిన వైద్య సిబ్బంది

కొత్తూరు: డెంగీ లక్షణాలతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి ఎస్‌బీపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వసుప్రియ(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. మూడు రోజులుగా బాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా.. తండ్రి రమేష్, కోళ్లపడక్‌లో ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించాడు. కాగా ఆదివారం రాత్రి చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించగా.. నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డెంగీతోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి, సిబ్బందితో కలిసి గ్రామంలో పలువురికి ఫీవర్ పరీక్షలు నిర్వహించారు. ఎవరూ జ్వరంతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి రాలేదని వైద్యురాలు తెలిపారు. చిన్నారి డెంగీతో మృతి చెందిందా, ఇతర అనారోగ్య సమస్యలతోనా అనేది వైద్య పరీక్షల్లో తేలనుందన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేస్తామంటూ..

- ధర్మాపూర్ జీపీ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తుల తిష్ట
- తహసీల్దార్ అప్రమత్తతతో జారుకున్న వైనం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచన



కంప్యూటర్, ప్రింటర్ తదితర పరికరాలతో ధర్మాపూర్ జీపీకి వచ్చిన యువకులు

ధారూరు: ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయడంతో పాటు తప్పులను సవరిస్తామంటూ ఇద్దరు వ్యక్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తిష్ట వేశారు. వీరిపై కొంతమంది స్థానిక యువకులకు అనుమానం రావడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చేసరికి అక్కడి నుంచి జారుకున్నారు. తహసీల్దార్ సాజిదాబేగం, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్‌కు చెందిన ఇద్దరు యువకులు కంప్యూటర్ పరికరాలు, ప్రింటర్, వైట్ పేపర్లతో శనివారం ధర్మాపూర్ జీపీకి వచ్చారు. మాజీ సర్పంచ్ పంపించాడని, గెజిటెడ్ సంతకాలు అవసరమైనా తామే చూసుకుంటామని నమ్మబలికారు. ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం రూ.35 బదులు రూ.350 వసూలు చేస్తుండటంతో అనుమానం వచ్చిన పలువురు యువకులు తహసీల్దార్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఈడీఎంకాల్‌చేసిన ఆమె ఆధార్ అప్‌డేట్ కోసం ధర్మాపూర్ జీపీకి ఎవరినైనా పంపంచారా అని ఆరాతీయగా లేదనే సమాధానం వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆమె స్థానికుల ఫోన్‌ద్వారా యువకుల వివరాలు చెప్పమనగా తడబడ్డారు. తాను వచ్చేవరకు ఎవరి ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్లు సేకరించవద్దని సూచించడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గ్రామాల్లో సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. వ్యక్తిగత సమాచారం సేకరించి, మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరి పేరు యూసూఫ్ అని, విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

పశు సంరక్షణపై ఆందోళన



పశువైద్యశాఖ ఏడీఏ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి

వైద్యాధికారుల తీరుపై ఏఎంసీ చైర్మన్ అసంతృప్తి

తాండూరు రూరల్: పశువైద్య శాఖ అధికారుల తీరుపై తాండూరు ఏఎంసీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని పశువైద్య ఏడీఏ కార్యాలయాన్ని సందర్శించారు. గంటపాటు అక్కడే ఉన్నా వైద్యులు ఎవరూ రాలేదు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నోవా కొన్ని నెలలుగా రైతులకు అందుబాటులో ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాంత తాండూరు పాటు పలు కాలనీల రైతులు పశు వైద్యులు లేక జీవాలకు సరైన వైద్యం అందడం లేదని ఫిర్యాలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు కార్యాలయానికి రావడంతో సిబ్బంది మల్లికార్జున్ మినహాయిస్తే ఎవరూ లేరన్నారు. రోగాలు వ్యాప్తి చెంది పశువులు మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇదే విషయమై జిల్లా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ సదానందంను ఫోన్‌లో సంప్రదించారు. డాక్టర్ల తీరుపై స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

వసతి గృహాల్లో సెలవుల సందడి

- తల్లిదండ్రులు, విద్యార్థులతో కిక్కిరిసిన హాస్టళ్లు
- దసరా హాలీడేస్ నేపథ్యంలో ఇంటిబాట పట్టిన విద్యార్థులు



ఎంజేపీజేసీ గురుకులం తల్లిదండ్రులు, విద్యార్థులతో సందడిగా మారిన ఆవరణ



ఇళ్లకు వెళ్లే క్రమంలో సంతోషంగా బైబై చెబుతున్న చెట్టుపల్లితండా కేజీబీవీ విద్యార్థినులు

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో గురుకులాలు, కేజీబీవీల్లో శనివారం సందడి కనిపించింది. జూన్ మాసంలో పాఠశాల పునఃప్రారంభం నుంచి ఇప్పటి వరకు సెలవులు లేకపోవడంతో కొంత ఒత్తిడికి గురైన విద్యార్థులకు పండగు హాలీడేస్ ఉపశమనం కలిగించాయి. తమను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, పోషకులతో సంతోషంగా ఇంటిబాట పట్టారు. పిల్లల కోసం వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సంక్షేమ హాస్టళ్ల కిక్కిరిసిపోయాయి. విద్యార్థులు ఇంటికి వెళ్తున్న తరుణంలో బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు కిక్కిరిసిపోయాయి. పలుచోట్ల ఆర్టీసీ బస్సులను ఆపకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు చేరుకున్నారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి



ప్రతిజ్ఞ చేయిస్తున్న బాబురావు

హెచ్‌ఎం బాబురావు

మోమిన్‌పేట: ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు బాబురావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కోల్కుందలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా చిన్నారు తల్లులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. ప్రతీ తల్లి బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లి పాలతో బిడ్డకు ఆరు రోగాలు దరిచేరవని వివరించారు. ఆరు నెలల వరకు తల్లి పాలను పట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని పోషకాహారలోపం సమస్యలకు దూరంగా ఉండాలని సూచించారు. చిరు ధాన్యాలు, కూరగాయలు పుష్కలంగా తీసుకోవాలని చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గొంగమ్మ, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్



అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, వృద్ధులు

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, సాధారణ పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పుతోందన్నారు. పెన్షన్ దరఖాస్తులను ఆమోదించిన ప్రతీ ఒక్కరికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కొడంగల్ ప్రధాన చౌరస్తా నుంచి తహసీల్దార్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రకాశ్, దివ్యాంగులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లు ఇవ్వాలి



అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట

అనంతగిరి: ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం పెన్షన్లను పెంచాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వృద్ధులు, దివ్యాంగులు, ఎంఎస్పీ నాయకులతో కలిసి వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినా కొత్త పెన్షన్‌లు ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి దసరా నుంచే పెన్షన్‌లను మంజూరు చేయాలన్నారు.